

19 వ వసంతంలోకి ...

సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,30 జనవరి 2026

8 పేజీలు


# తిరుమలలో చేసింది మహా పాపం






**- అదే వైసిపి పార్టీ వాళ్ళకు పెద్ద శాపం**
**- వాళ్ళు చేసిన నేరాన్ని ఎన్నటికీ ప్రజలు క్షమించరు**
**- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం**

**నూజివీడు,మేజర్‌న్యూస్ :** వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు తయారీలో కల్తీ జరిగినట్లు సిట్ నివేదిక ద్వారా స్పష్టమైయిందని,వైసిపి నాయకులు చేసిన కుంభకోణం బట్టబయలైన కారణంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు స్థానిక శ్రీశక్తి భవనం నుండి ర్యాలీగా శ్రీ వెంకటాచల స్వామివారి దేవస్థానానికి చేరుకుని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుద్ధి కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్తీ నెయ్యి అంశంపై మీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని నూజివీడులో గురువారం మంత్రి మాట్లాడుతూ మహా పాపం నిజం – 68.17 లక్షల కిలోలు కల్తీ నెయ్యి ఆది నెయ్యే కాదు ! పామాయిల్, కెమికల్ కలిపిన ద్రవం ! లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసులో సిట్ స్పష్టం చేసిందని అన్నారు. ఆ కల్తీ నెయ్యితోనే శ్రీవారి ఆలయంలో 20 కోట్ల లడ్డు ప్రసాదాలు తయారీ, వైసిపి పెద్దలకు రూ 251 కోట్లను తమజేబుల్లో వేసుకున్నారని అతి పెద్ద స్కామ్ అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కల్తీ జరిగిందని సిట్ నివేదిక ద్వారా స్పష్టంగా వెలుగులోకి రావడం అత్యంత దిగ్భ్రాంతి కరమైన విషయం, బాధాకరం అన్నారు. కోట్లాది మంది భక్తులు విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల లడ్డు తయారీలో జరిగిన ఈ అవకతవకలు, వైకాపా నాయకులు చేసిన కుంభకోణాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. సిట్ నివేదికలో వెల్లడైన అంశాలు అప్పటి ప్రభుత్వ

- తరువాయి 2లో..

## బాల్య వివాహాల నిరోధానికి
# కట్టుదిట్టమైన చర్యలు

**- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** బాల్య వివాహ ముక్తభారత్ వంద రోజులు కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,జిల్లా బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా రూపొందించిన 'బాల్య వివాహ విముక్తి రథం" ను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాను బాల్యవివాహారహిత జిల్లాగా తీర్చిదిద్దే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్యవివాహాన్ని అరికడదాం – ఆడపిల్లను చదివిద్దాం అనే స్లోగన్‌తో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎట్టి పరిస్థితుల్లో జరగడానికి వీల్లేదని,అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో జనవరి 29 నుండి ఫిబ్రవరి 11వ తేదీ వరకు జిల్లా అంతటా ప్రచార రథం

- తరువాయి 2లో..

## వాట్సాప్ గవర్నెన్స్‌పై
# ప్రజలకు విస్తృత అవగాహన

**- సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వెల్లడి**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని జిల్లాకలెక్టర్ కె.వెట్రి సెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్‌కు తెలియజేసారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం ఎంఎస్ఎం ఈపార్కుల ఏర్పాటు, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు,రెవిన్యూ, సర్వే, రవాణా శాఖ, తదితర శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలలో ప్రజలసంతృప్తిస్థాయి,మల్టీ స్పెషలిటీ ఆసుపత్రుల నిర్మాణం,

- తరువాయి 2లో..

## వైసీపీ నిర్లక్ష్యం వల్లే
# స్మార్ట్ సిటీస్ పనుల్లో వెనుకబడ్డ ఏపీ

**- ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**ఏలూరు/ఢిల్లీ,మేజర్‌న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు పనుల్లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడినట్లు బయటపడింది. స్మార్ట్ సిటీస్ మిషన్ పనుల పురోగతిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోఖాన్ సాహు సమాధానం ఇచ్చారు. ఈ వివరాలను మీడియాకు విడుదల చేశారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాలను పరిశీలిస్తే. స్మార్ట్ సిటీస్

- తరువాయి 2లో..

## శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని
# అపవిత్రం చేసిన జగన్

**- కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైసిపి నేతలు**
**- జిల్లా టిడిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి ధ్వజం**






**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులకు ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి, కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్,ఇతర వైసిపి నాయకులు తక్షణం స్వామివారికి క్షమాపణ చెప్పి తమ తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే బడేటి చంటి డిమాండ్ చేశారు. అలాగే వైసిపి నాయకులకు భవిష్యత్తులో రాష్ట్రంలో ప్రజలను ఓటు వేయమని అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. మతాల మధ్య విద్వేషాలను, కులాల మధ్యకొట్లాటలను సృష్టించి తనపబ్బం గడుపుకోవాలను కుంటున్న జగన్మోహన్ రెడ్డికి సిబిఐ సిట్ ఇచ్చిన నివేదిక చెంపపెట్టులాంటిదని బడేటి చంటి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సిబిఐ సిట్ శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యి సరఫరాలో బడా కుట్ర జరిగినట్లు తేల్చిన నేపథ్యంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని కూడా వైసిపి నాయకులు అపవిత్రం చేశారని పేర్కొంటూకూటమి ఆధ్వర్యంలో గురువారం మహాపాపం నిజం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆర్ఆర్ పేటలో టిడిపి జిల్లా అధ్యక్షులు బడేటి చంటి,బీజేపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనగా బయల్దేరి

- తరువాయి 2లో..

# మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ -2 సాధించిన వర్ధనపు అనుదీప్

పెనుమంట్ర, మేజర్ న్యూస్ : పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వర్ధనపు అనుదీప్ ఫస్ట్ ప్రయత్నంలోనే గ్రూప్ 2 ఎంపికయ్యారు. పాలకోడేరు మండలం కుముదపల్లికి చెందిన వర్ధనపు సామ్యూల్ రాజు కుమారుడుపాలకోడేరు మండలం కుముదవల్లి, ఎస్.ఎస్.సి:బి.హెచ్. వి.ఎన్.ఆర్ .జిల్లా పరిషత్ పాఠశాల, విద్యాభ్యాసం చేసి భీమవరం ఆదిత్య జూనియర్ కాలేజ్ ఇంటర్ పూర్తి చేశారు.



స్వర్ణంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ, నర్సాపూర్ బీటెక్ పూర్తి చేశారు.2015–2019జూనియర్ అసిస్టెంట్ (పంచాయత్ రాజ్ డిపార్ట్మెంట్) మండల్ ప్రజాపరిషత్, కాళ్ళ,2019–2024జిల్లా పరిషత్ పాఠశాల ,ఆకివీడులోను, తదుపరి 2024లో పొలమూరుజిల్లా పరిషత్ పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. నిన్న విడుదలైన గ్రూప్–2 రిజల్ట్ లోఆంధ్రప్రదేశ్ సచివాలయం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు వై లక్ష్మీనారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీడీఎస్ సరస్వతి, ఉపాధ్యాయులు కోడి చంద్రశేఖర్, పితాని పాండురంగా, నేతల రవి కిరణ్, తోకల రాంబాబు, కేత విజయ్, ఝాన్సీ లక్ష్మీ, రాజ్యలక్ష్మి, ప్రమీల, మేఘమాల, నాగమణి, లక్ష్మీ, శ్రీను తదితరులు అభినందించారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన జగన్

మొదటిపేజి తరువాయి

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం చేరుకున్నారు. అక్కడ స్వామి ఆలయ ప్రాంగణంలో సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపట్టి ఆలయాన్ని పరిశు భ్రం చేశారు. ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ఈ కార్యక్రమాన్ని చేయించారు. అనంతరం టిడిపి అధ్యక్షులు బడేటి చంటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్, వైసిపి నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆరోపించారు. ఆఖరికి తిరుమల దేవదేవుని ప్రసాదాన్ని కూడా కల్తీ చేసేందుకు వెనకాడలేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వినియోగించి లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారంటూ సిట్‌తో పాటూ ఇతర విచారణ సంస్థలు తేల్చడంతో వైసిపి ప్రభుత్వంలో జరిగిన లడ్డూ అపవిత్రత నిజమని తేటతెల్లమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా వాస్తవాలను అంగీకరించి మాజీ సీఎం జగన్, వైసిపి నాయకులు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని క్షమాపణ వేడుకోవాలని సూచించారు.బీజేపి జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే,లడ్డూ కల్తీ వ్యవహారంలో విచారణ సంస్థలన్నీ నిగ్గు తేల్చిన నిజాలు తిరుమల దేవాలయ విశిష్టతను కాపాడే విధంగా ఉన్నాయంటూ వెల్లడించారు, కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఎఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డిప్యూటి మేయర్ కర్రి శ్రీనివాస్, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం చైర్మన్ పాలడుగు వెంకట రమాదేవి, ఆలయ ధర్మకర్తలు ఈతకోట శ్రీనివాసరావు, గోకా నెహ్రూబాబు, కందుకూరి వెంకట సీతారామాంజనేయ శర్మ, టిడిపి నాయకులు ఎస్సెమ్మార్ పెదబాబు, ఏలూరు నగర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ పిల్లారి శెట్టి సంధ్య సురేష్, క్లస్టర్ ఇంచార్జ్ ఆర్ఎన్ఆర్ నాగేశ్వరరావు,బిజేపి మహిళా మోర్చ అధ్యక్షురాలు ఇలపకుర్తి కుసుమ కుమారి ,పలువురు క్లస్టర్ ఇంచార్జీలు, డివిజన్ ఇన్చార్జులు,వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# బాల్య వివాహాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు

మొదటిపేజి తరువాయి

ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విస్తృతంగా పర్యటించి ప్రజల్లో అవగాహన,చైతన్యం తీసుకురావడం ద్వారా బాల్యవివాహాల నిర్మూలనా లక్ష్యమే దీని ముఖ్య ఉద్దేశం అన్నారు.బాల్య వివాహం చేసినందుకు తల్లిదండ్రులు, వివాహానికి హాజరైన బంధు,మిత్రులకు 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష,లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చుఅని హెచ్చరించారు. బాల్యవివాహాలుచేసేపండితులు, మౌల్వీలు,పూజారులను కూడా శిక్షలు ఉంటాయన్నారు.బాల్య వివాహాలకు సేవలు అందించే వ్యక్తికి, బేకరి,మిఠాయి తయారీదారు, బ్యాండ్, టెంట్ యజమాని లేదా ఇందులో పాల్గొన్న ఎవరైనా 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష ,రూ.ఒక లక్ష వరకు జరిమానా లేదా రెండూ విధించడం జరుగుతుందన్నారు. బాల్యవివాహం చేసిన వ్యక్తికి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించవచ్చు అని తెలిపారు.ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, విద్యాశాఖ, పోలీసు శాఖ,గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు,సమన్వయంతో ఈ ప్రచారాన్ని ప్రభావంతంగా నిర్వహించేందు కు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్ మాట్లాడుతూ ఈ ప్రచార రథం జిల్లాలోని అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులు, పెళ్లిళ్లు చేసే ప్రదేశాలలో పర్యటిస్తుందని తెలిపారు.చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిగితే హెల్ప్ లైన్ 1098కు లేదా 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పి.డి డి.శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, డిసిసియు సిబ్బంది, క్రాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ నిర్లక్ష్యం వల్లే స్మార్ట్ సిటీస్ పనుల్లో వెనుకబడ్డ ఏపీ

మొదటిపేజి తరువాయి

మిషన్ కింద,మిషన్ ప్రారంభించినప్పటి నుండి దేశ వ్యాప్తంగా 1,64,811 కోట్ల విలువైన మొత్తం 8,064 ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం 15.01.2026 నాటికి రూ.1,55,859 కోట్ల విలువైన 7,767 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 8,952 కోట్ల విలువైన మొత్తం 297 ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతున్నాయి. గురువారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ లోని నాలుగు నగరాల్లో 6,589 కోట్ల విలువైన 280 ప్రాజెక్టులు ప్రారంభించగా, ఇప్పటివరకూ 249 ప్రాజెక్టులు పూర్తి కాగా, 31 ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఎంపి వెల్లడించారు.

# 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



ఏలూరు,మేజర్ న్యూస్ : 12వ,తేదీన జరగబోవు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ ఏలూరు జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం వన్ టౌన్ ఏరియా వైఎంహెచ్ఎ హాల్ వద్ద ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇఫ్టూ నగర సహాయ కార్యదర్శి ముంగం అప్పారావు మాట్లాడుతూ భారతదేశ కార్మిక వర్గంపై బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను ప్రవేశపెట్టి హక్కులను కాలరాసే విధంగా పెట్టుబడిదారి వర్గానికి అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణం చేస్తున్నాయని,ఆ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఫిబ్రవరి 12వ,తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చినారు.ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమానికి సంధకం అప్పారావు,అన్నవరం, గునుపూడి నాగేశ్వరరావు, ఈశ్వరరావు, ఎం.రామ్మూర్తి, శాంతి నాగేశ్వర్, అల్లు సత్యనారాయణ, కె.సత్యారావు, సాలి బాబు, ఆర్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో చేసింది మహా పాపం

మొదటిపేజి తరువాయి

పెద్దల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం అవినీతిని స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. పవిత్ర మైన శ్రీవారి ప్రసాదాన్ని కూడా రాజకీయ లాభాలు కోసం, వ్యక్తిగత స్వార్థాలు కోసం కల్తీ చేయడం అనేది క్షమించరాని నేరమని అన్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు కోట్లాది మంది భక్తులు మనోభావాలుపై చేసిన దాడిగా భావించాలని అన్నారు. ఈ వ్యవహారంపై వైకాపా నాయకులు ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. తప్పుచేసిన వారిని గుర్తించి, కఠినమైన చర్యలు తీసుకో వడం ద్వారా మాత్రమే భక్తులు విశ్వాసాన్ని తిరిగి పొందగలు గుతామనిఅన్నారు.ఈ కుంభకోణంలో భాగస్వాములైన వారెవరైనా సరే, రాజకీయ హోదాలు, పదవులు పక్కనపెట్టి చట్టప్రకారం శిక్ష పడాల్సిందేనని అన్నారు.తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతఅని, భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలనిఅన్నారు,ఈఅంశంపై సమగ్ర విచారణ జరిపిమరిం తనిజాలను పూర్తిగా ప్రజలు ముందుకు ఉంచాలని, ఇంతటి దారుణానికి చేసినవారిని తప్పకశిక్షలుపడాలని అన్నారు. ఈకార్య క్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌పగడాల సత్య నారాయణ, కౌన్సి లర్లు,ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు ,భక్తులు,పట్టణప్రజలు,ఎక్కువసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు విస్తృత అవగాహన

మొదటిపేజి తరువాయి

తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను కలెక్టర్ వెట్రిసెల్వి సీఎస్‌కి వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే సేవలపై ప్రజా భిప్రాయాన్ని తెలుసుకు నేందుకు సంబంధిత శాఖల కార్యాలయాలు,దేవాలయాల వద్ద క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేయాలన్నారు.మన మిత్ర యాప్ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు ప్రభుత్వం నుండి పౌర సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని,వాట్సాప్ గవర్నెన్స్ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి ప్రజలు సులభమైన రీతిలో ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులు పొందడం, వంటి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాలలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో ని ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ పై విస్తృత అవగాహన కలిగిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలలో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు,జిల్లా పరిశ్రమల అధికారి వెంకటరావు, డిఎంహెచ్ఓ డా. అమృతం, డిసిహెచ్ ఎస్ డా.పాల్ సతీష్, ఆర్టీఓ శేఖర్, ప్రభృతులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులను పరామర్శించిన వైసిపి ఇన్‌చార్జి వడ్డీ రఘురాం



తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్; తాడేపల్లిగూడెం పట్టణంలోని తాళ్లముదునూరుపాడు 18వ వార్డులో వైసీపీ నాయకులు సత్తి భాస్కర్ రెడ్డి తల్లి సత్తి కనక భాస్కరం ఇటీవల అకాల మరణ చెందినారు. అది తెలుసుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్,వైఎస్ఆర్ సీపీ నాయకులు మాకరాజు సతీష్, అంజిరెడ్డి, పట్నాల గణపతి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన



ఏలూరు,మేజర్ న్యూస్ : త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. కోటేశ్వరరావు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. హబీబ్ బాషా పాల్గొని సమాచార హక్కు చట్టంపై ప్రజలకు, ఆటో యూనియన్ వర్కర్లకు అవగాహన కల్పించారు.ఈ సదస్సులో ఆటో యూనియన్ వర్కర్లు, సాధారణ ప్రజలు పాల్గొని సమాచార హక్కు వినియోగం, ప్రజా భద్రత ,పోలీస్ శాఖతో సమన్వయం అంశాలపై స్పష్టత పొందారు.

# కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి అడ్డుపడుతున్నది ఎవరు ?




– సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సూటి ప్రశ్న

ఏలూరు,మేజర్ న్యూస్ : కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి అడ్డుపడుతున్నది ఎవరని, 120 జీవోను రద్దు చేసేందుకు, 3వ కాంటూర్ కు కుదించేందుకు, కోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు, 3వ కాంటూర్ కు వెలుపల ఉన్న ప్రభుత్వ భూములు పేదలు సాగు చేసుకునే అవకాశం కల్పించేందుకు, కొల్లేరు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, ఇంతకుముందు ఇస్తామన్న నష్టపరిహారం ఇచ్చేందుకు అడ్డుపడుతున్నది ఎవరని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సూటిగా ప్రశ్నించారు. కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు పత్రికా ముఖంగా స్పందించిన దానికి, సొంత కుమారుడు తీవ్రమైన అనారోగ్యంతో మంచం పడితే ఏ విధమైన ఆవేదన చెందుతామో అదే విధంగా కొల్లేరు సమస్యపై ఆవేదన చెందుతున్నామని ప్రకటించడంపై రవి పై విధంగా స్పందించారు.కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపితే చాలా సంతోషమని, కొల్లేరు ప్రజలతో పాటు సిపిఎం పార్టీగా తాము అదే కోరుతున్నామని అన్నారు. అదే క్రమంలో కొల్లేరు సమస్యను కేవలం ఓట్ బ్యాంకుగా చూస్తూ ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేసి ఎన్నికల అయిన తర్వాత ఏరు దాటినాక తెప్ప తగలబెట్టినట్లు ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదన్నారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి డబుల్ ఇంజన్ సర్కార్ గా ఉన్న కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వివరించాలని సూచించారు. దేశ ప్రధాని మోడీ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, చంద్రబాబు, పవన్ ఎన్నికల సందర్భంగా కొల్లేరు సమస్యపై అసెంబ్లీలో తీర్మానం చేస్తామన్న హామీని నిలుపుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రోటరీ మెడికల్ చైర్మెన్ వెలివెల పెద్దిరాజు సేవలు అభినందనీయం



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్యా ప్రవల్లిక ఆధ్వర్యంలో శ్రీ మల్లాది సీతా రామ లింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ పూర్వపు ప్రెసిడెంట్,ప్రస్తుత మెడికల్ చైర్మెన్ వెలివెల పెద్దిరాజుకి సన్మాన కార్యక్రమం జరిగింది. పెద్దిరాజు బుట్టాయిగూడెం మండలం నిమ్మలగూడెం పిహెచ్‌సిలో కొన్ని సంవత్సరాలు గా ఎంపిహెచ్ఇఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మెడికల్ డిపార్ట్మెంట్లో వారు అందిస్తున్న సేవలు కార్యదీక్ష పనితీరు ,గత కొన్ని రోజుల క్రితం బుట్టాయిగూడెం మండలం అనేక గ్రామాలు అతిశర వ్యాధి , డెంగ్యూతో ప్రజలు అత్యంత అనారోగ్య సమస్యలకు గురికాబడి చాలా ఇబ్బందికరంగా ఉన్న రోజుల్లో వెలివెల పెద్దిరాజు అత్యంత కీలకమైన,సమస్యాత్మక ప్రాంతాలు సందర్శిస్తూ, వ్యాధులు ఉధృతం కాకుండా ప్రతి ఊరు లో బ్లీచింగ్ చల్లించడం,అనేక ఆరోగ్యకరమైన చర్యలు తీసుకుంటూ చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న గిరిజనలు నివసించే కొండ ప్రాంతాలు అన్నీ కూడా సందర్శిస్తూ చాలా చక్కగా సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు దాకారపు కృష్ణ,జి.ప్రసాద్,కుబేర చిట్ సుబ్బారావుమాణిక్యాలరావు,జవాజీ ఉమా వెంకటేష్, రేణుక కోటేశ్వరరావు,సింగంశెట్టి హరిబాబు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు అందించారు.

# వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతి ప్రధానం



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగనాయకులు ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు 'రహదారి భద్రత' అంశంపై డ్రాయింగ్ ,వ్యాస రచన పోటీలు సంగతి తెలిసిందే. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆర్టీవో కార్యాలయంలో బహుమతుల ప్రధానం జరిగింది.ఈ కార్యక్రమంలో తపస్ హై స్కూల్, సూర్య విద్యా వికాస్,ప్రతిభ వెంకటేశ్వర పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రహదారి భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణం



పాలకోడేరు,మేజర్ న్యూస్ : గోస్తని నది 95వ తీర్థోత్సవలో భాగంగా గురువారం శ్రీ రామచద్రమూర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణం ఘనంగా నిర్వహించారు అనంతరం సీత దేవి అలివేలు మంగ పద్మావతి అమ్మవార్ల కుంకుమార్చన పూజలు నిర్వహించి 5వేల మందికి అన్నదాతల సౌర్జన్యంతో అఖండ అన్న సమారాధన నిర్వహించినట్లు గోస్త నది తీర్థోత్సవ కమిటీ చైర్మన్ గాది రాజు కృష్ణ రాజు తెలిపారు.

# మున్సిపల్ కార్మికులకు పాదరక్షలు పంపిణీ



ఏలూరు,మేజర్ న్యూస్ : మున్సిపల్ కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించేందుకు వారిని ప్రోత్సహిస్తూ వారికి ఇవ్వవలసిన ప్రయోజనాలు అన్ని సకాలంలో అందిస్తున్నామని నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు.గురువారం కార్పొరేషన్ కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగులు ఒక్కొక్కరికి నాలుగు జతల పాదరక్షలను అందజేశారు. ఈ సందర్భంగా కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య,మేయర్ నూర్జహాన్ పెదబాబు,కమిషనర్ ఏ.భాను ప్రతాప్ సమన్వయంతో కార్మికులకు ఇవ్వవలసిన ప్రయోజనాలు, పదోన్నతులు,బాకాయిలు అన్ని సకాలంలో ఇచ్చి కార్మికులను సంతోషపెట్టి వారితో సక్రమంగా విధులు చేయిస్తున్నామన్నారు. సంవత్సరానికి 2 జతల పాదరక్షలు చొప్పున 2 సంవత్సరాలకు సంబంధించి ఒక్కొక్కరికి నాలుగు జతలు పాదరక్షలు స్త్రీ పురుషులు 296 మందికి ఈరోజు అందజేశామని ఎస్ఎం ఆర్ పెదబాబు తెలిపారు. ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నాలుగు ప్రాంతాల్లో 40 మంది సిబ్బందితో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు.వీధిలైట్ల విషయానికి వస్తే 17 వేల 500 వీధిలైట్లు సక్రమంగా వెలిగే విధంగా వాటికి సంబంధించిన అన్ని రకాల స్పేర్ పార్ట్స్ సిద్ధం చేశామని కో–ఆప్షన్ సభ్యులుఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.శ్రీనివాస్, బి.శివారెడ్డి, సూపర్నెండెంట్ సిరాజుద్దీన్,కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి నాగబాబు,పాము శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డి గూడెం రహదారికి నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే రోషన్ కృషి



చింతలపూడి,మేజర్ న్యూస్ : గత రెండు న్నర దశాబ్దాలుగా సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న నాగిరెడ్డి గూడెం పరిసర ప్రాంత ప్రజలకు మోక్షం కలిగేలా శాసనసభ్యులు రోషన్ కుమార్ నూతనంగా రోడ్డు నిర్మాణానికి ప్రయత్నాలను ముమ్మరం చేశారు.అందులో భాగంగా బుధవారం రాష్ట్ర రాజధాని ఇలానే గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిని,ఆ శాఖ చీఫ్ ఇంజనీర్ వసంతని కలసి నాగిరెడ్డిగూడెం రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాలని రోషన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సుమారు నాలుగున్నర కోట్ల వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనున్నట్లు సీఈ వసంత పేర్కొన్నారు.

# ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి : డిపిఓ



జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ : మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని కుక్కునూర్,జీలుగుమిల్లి ,జంగారెడ్డి గూడెం మూడు మండలాల పంచాయతీ అభివృద్ధి అధికారులతో పంచాయతీల నందు గృహ పన్నులు,ఈ – గవర్న నెన్స్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల నందు పన్నుల వసూళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని,పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టాలని ఆదేశం ఇచ్చారు. సమవేశములో డివిఎల్‌డిఓ ఎం.రాజు, డివిఎల్‌పిఓ ఎ.సుబ్బారాయన్,ఎంపిడిఓ సుజాత మండలాల పంచాయతీ అభివృద్ధి అదికారులు పాల్గొన్నారు.

# బీవి రాజు ఫౌండేషన్ సహకారంతో నూతన బస్టాప్ నిర్మాణం

– ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




భీమవరం,మేజర్ న్యూస్ : భీమవరం పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.పట్టణంలోని బివి రాజు సర్కిల్ నందు బివి రాజు ఫౌండేషన్ దాతృత్వంతో రూ. 8లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన నూతన బస్ స్టాప్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి,బివి రాజు కళాశాల స్టూడెంట్స్ ఎఫైర్స్ డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు,కళాశాల విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.బస్ స్టాప్ ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే దాతల సహకారంతో పట్టణంలో అనేక మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం జరిగిందని, మరిన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కేంద్రాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరాయంగా కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే బివి రాజు ఫౌండేషన్ దాతృత్వంతో పట్టణంలో పలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.

# మా భూములు ఇవ్వలేం - మా జీవితాలు నాశనం చేయెద్దు





1- కొయ్యలగూడెంలో రైతులు,మహిళల ఆందోళన

- నేవీ ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణ చేయవద్దు

**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** మా భూములు ఇవ్వలేం.. మా జీవితాలు నాశనం చేయవద్దు.. నేవీ ఆయుధ డిపో పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కొయ్యలగూడెం మండలం బోడిగూడెం,మంగపతి దేవిపేట, బర్కెట్ నగర్, రేగులగుంట,ఊట్లగూడెం, త్రినాధపురం గ్రామాల రైతులు,రైతు కూలీలు,మహిళలు,ప్రజలు కొయ్యలగూడెంలో కదం తొక్కారు.మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు.మా ప్రాణాలైనా ఇస్తాం గానీ మా భూములు ఇవ్వలేమని అంటూ మహా ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుండి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి తాడేపల్లిగూడెం రోడ్డు వద్ద కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. నిరసనకారులు నినాదాలతో హోరెత్తించారు. కొయ్యలగూడెం మండలంలో నేవీ ఆయుధ డిపో నిర్మాణానికి వ్యతిరేకంగా గురువారం రైతులు భారీ నిరసన కార్యక్రమంలో పోలవరం, గోపాలపురం నియోజకవర్గాలకు చెందిన రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోడిగూడెం గ్రామం నుంచి కొయ్యలగూడెం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల ర్యాలీ నిర్వహించారు. నేవీ ఆయుధ డిపో ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామసభ తీర్మానం లేకుండా,ప్రజల అభిప్రాయం తెలుసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రైతులను జైళ్లలో నిర్బంధించైనా భూములు తీసుకుంటాం ఆయుధ డిపోని ఆపబోము' అంటూ ఏలూరు ఎంపీ చేసిన వ్యాఖ్యలపై రైతాంగం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఆయుధ డిపో నిర్మాణానికి 1200 ఎకరాల భూసేకరణ కోసం చేస్తున్న ప్రయత్నాలు తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణ చైతన్య సంఘీభావం ప్రకటిస్తూ మాట్లాడారు. జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో ఆయుధ డిపో నిర్మాణ భూసేకరణ పై పెద్ద ఎత్తున గిరిజనులు రైతులు ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం సాగించాలని గుర్తు చేశారు. ప్రజల పోరాటానికి అండగా ఉంటామని చెప్పారు. బాధిత రైతులు చలసాని కిషోర్,ఆతుకూరి వీర్రాజు,మంగపతి దేవి పేట సర్పంచ్ సుబ్రహ్మణ్యం,సుగ్గన బోయిన ఏడుకొండలు, జక్కుల పెద వెంకన్న,ఆపూరి గంగరాజు కానూరి శ్రీను,మెంతి సీతారాములు,రేగులగుంట సర్పంచ్ ఇళ్ళ శ్రీరామ మూర్తి,గున్నూరి దాక్టరమ్మ, నిమ్మగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ 90 శాతం మంది రైతులు భూసేకరణ అంగీకరించారని ఏలూరు ఎంపీ ప్రచారం చేస్తున్నారని, మేము ఎక్కడ అంగీకరించామో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామసభ నిర్వహించకుండా మా ఆమోదం లేకుండా ఎంపీ ఏ విధంగా చెబుతారని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు ప్రచారం మానుకోవాలని కోరారు. సర్వే పేరుతో మళ్లీ భూముల్లోకి వస్తే ఆత్మార్పణ చేసుకుంటామని ప్రభుత్వానికి రైతాంగం అల్టిమేటం ఇచ్చింది. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ బలవంతంగా భూసేకరణ చేయమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ రైతాంగ ఉద్యమానికి సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి ఆంజనేయరాజు, ఏఐకేఎంఎస్ నాయకులు మడకం రామన్న సంఘీభావం ప్రకటించారు.

# చెస్ విజేత కుషాంక్ శ్రీ విశ్వకు అభినందనలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** రావులపాలెంలో జరిగిన ఆల్ ఇండియా రిపబ్లిక్ డే చెస్ టోర్నమెంట్‌లో 267 మంది ప్లేయర్లు పాల్గొనగా జంగారెడ్డిగూడెం దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీకి చెందిన చెస్ ప్లేయర్ మల్లంపల్లి కుషాంక్ శ్రీ విశ్వ ఓపెన్‌లో 3వ స్థానాన్ని అండర్ 13 లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

5వేల రూపాయిలు నగదు బహుమతిని పొందినందుకు దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమీ చెస్ కోచ్ అండ్ డైరెక్టర్ అయినపర్తి సరళామాధవి అయినపర్తి చంద్రశేఖర్ మాస్టారు తల్లిదండ్రులు ప్లేయర్లు అభినందనలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రజా వైద్యానికి పెద్ద పీట





- ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే ,జెసి

**తణుకు,మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వైద్యానికి పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. తణుకు ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గురువారం బ్లడ్ బ్యాంకు తోపాటు ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభించి ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. రాష్ట్రంలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి నాణ్యమైన వైద్యాన్ని అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

దీర్ఘకాలికంగా ఎంతో మందికి అవసరమైన బ్లడ్ బ్యాంకు, ఫిజియోథెరపీ సెంటర్ అవసరాలను గుర్తించి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి చొరవతో వీటిని ప్రారంభించామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని ఇక్కడే దాతలు అందజేసి బయట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందే పేద రోగులకు అందించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సొసైటీని ఏర్పాటు చేసి ప్రభుత్వపరంగా మంత్రి నారా లోకేష్ చొరవతో ఉచితంగా ఇంజక్షన్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 35 మందికి ఉచితంగా ఇంజక్షన్లు అందజేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. తణుకులోని పలు ప్రైవేటు ఆసుపత్రులను అనుసంధానం చేసి అన్ని విభాగాలను పేదలకు అందుబాటులోకి సేవలు తీసుకువచ్చామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి,కూటమి నాయకులు,కార్యకర్తలు, ప్రభుత్వ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి 13 వరకు కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలు

- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం,మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలలో భాగంగా "స్పర్శ" లెప్రసీ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు,ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎంలు ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడి వర్కర్లు ప్రతిజ్ఞ చేయాలన్నారు. ప్రజలకు పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల సామాజిక వివక్షతను తొలగించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమాలలో కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ఉచిత చికిత్స సదుపాయాలపై తెలియజేయాలన్నారు. అలాగే అవగాహన ర్యాలీ, పోస్టర్ ప్రదర్శన ఆరోగ్య శిబిరం ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని సంబంధిత వైద్యాధికారుల ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# పేకాట,కోడి పందాల స్థావరాలపై పోలీసుల దాడులు



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్ :** ఎస్ఐ సుధీర్‌కి అందిన సమాచారం పై పంగిడిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.11వేల నగదు ,మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ద్వారకా తిరుమల ఎస్ఐ తమ పోలీస్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. అదే విధంగా, ఐఎస్ జగన్నాధపురం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడి నిర్వహించి, ఇద్దరు వ్యక్తులను అదుపు లోకి తీసుకొని, వారి వద్ద నుండి రూ.5,300 నగదు ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పై ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు.

# 1న గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నాగరాజు ప్రమాణం



**ఉండి, మేజర్ న్యూస్:** ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్గా ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ జుత్తుగ నాగరాజు ఉండి కోట్ల ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు నాగరాజు తెలియజేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆశీస్సులతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాపై ఎంతో నమ్మకంతో నాకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్గా అవకాశం కల్పించడం జరిగిందని వారు తెలిపారు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జనసేన పార్టీ నాయకులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రమాణ స్వీకారోత్సవానికి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, సుభాష్ తో పాటు ఎంపీలు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కార్పొరేషన్ చైర్మన్లు ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. జనసేన పార్టీ అభ్యున్నతికి మరింత కష్టపడి పని చేస్తానని ఆయన అన్నారు.

# అంతర్వేది భక్తులకు నరసాపురంలో అల్పాహారం పంపిణీ





**నరసాపురం, మేజర్ న్యూస్:** అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాలకు హాజరై తిరిగి వచ్చే భక్తుల సౌకర్యార్థం, నర్సాపురం పంటి రేవు వద్ద వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పులిహోర,మజ్జిగ, మంచినీరు ఇతర సౌకర్యాలను ఏటా కల్పిస్తూ ఉంటారు. పార్టీలకతీతంగా భక్తులకు సేవ చేయాలనే తలపుతో పోటీపడి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బుధవారం రాత్రి అంతర్వేదిలో లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం జరిగింది. వేలాదిమంది ఇతర జిల్లాల నుండి నరసాపురంలో రేవు దాటి అంతర్వేది వెళ్లారు. గురువారం వీరంతా తిరిగి వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాదాలు వడ్డించారు. ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, అలాగే తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొని భక్తులకు స్వయంగా పులిహోర బటర్ మిల్క్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మాజీ మంత్రి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు,మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు భక్తులకు వేరువేరుగా పులిహోర పంపిణీ చేశారు. గొంది బైపాస్ రోడ్ లో సర్పంచ్ అంజిబాబు, ఎర్రం శెట్టి నాగేశ్వరరావు ఇతర వ్యాపారుల ఆధ్వర్యంలో సుమారు 5వేల మందికి అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఆర్డీవో దాసిరాజు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ఇటువంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు ,టిడిపి మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, గంట కృష్ణ, బందెల రవీంద్ర, బొమ్మిడి కృష్ణమూర్తి, ఒడుగు ఏసు బాబు,తిరుమణి వెంకటరాజు ,పోలిశెట్టి నళిని,అంబటి అరుణ, బొమ్మిడి సూర్యకుమారి కృష్ణమూర్తి నియోజకవర్గ జనసేన, తెలుగుదేశం, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్వాక్రా,మెప్మా గ్రూపులకు సిఎం చంద్రబాబు శ్రీకారం



– ప్రతి మహిళను ఒక వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి లక్ష్యం : మంత్రి పార్థసారథి

**నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడు పురపాలక సంఘం పరిధిలో గురువారం స్త్రీశక్తి భవనంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహాజన సభలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెప్మా మహిళలతో మమేకం అయ్యారు. పట్టణంలో 990 గ్రూపులు ద్వారా 10,115 మంది మహిళలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన రుణాలు,పెట్టుకున్న వ్యాపారాలు,పొందుతున్న లాభాలను, విజయగాధలను వివరించారు.వారి చెప్పిన వ్యాపారాలు, విజయగాథలు విని మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యాపారాలు బాగా చేసుకుని స్ఫూర్తిగా నిలిచిన మహిళలను మంత్రి కొలుసు పార్థసారథి సన్మానించి, అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పేదలు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు.మహిళలు సాధికారతకు పెద్దపీట వేసిన మన ముఖ్యమంత్రి సుమారు 30 సంవత్సరాలు క్రితమే డ్వాక్రా, మెప్మాగ్రూపులు ఏర్పాటు ద్వారా మహిళలు చిరు వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతూ వ్యాపార వేత్తలుగా మారడానికి బాటలు వేశారన్నారు.ఈ సమావేశంలో మెప్మా పిడి పి.మాధవి,వివిధ బ్రాంచీలు బ్యాంకు మేనేజర్లు, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పగడాల సత్యనారాయణ,కౌన్సిలర్సు, మెప్మా సాంకేతిక నిపుణులు పార్వతి, మహాలక్ష్మి, దుర్గాచౌదరి, మెప్మాద్వారా రుణాలు పొందిన వివిధ సంఘాలు ప్రెసిడెంట్లు,సభ్యులు,కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మంత్రి అచ్చెన్నాయుడు ఏలూరు రాక

**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈనెల 30వ తేదీ ఉదయం ఏలూరు కలెక్టరేట్‌కు సమీపంలోని ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. అనంతరం ఏలూరులోని చింతలపూడి రోడ్డులోని బాలాజీ గార్డెన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి కోకో కాంక్లేవ్ సదస్సులో పాల్గొంటారు.అనంతరం ఉదయ, 11.30 నిలకు ఏలూరు నుండి విశాఖపట్నం బయలుదేరివెళతారు.

# ఉగాదికి 9,135 గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలి

– యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులతో మండలాల వారీగా గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు వచ్చే ఉగాది నాటికి లబ్ధిదారులకు అందించేందుకు 9,135 గృహ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు పూర్తి చేసిన గృహ నిర్మాణాల ప్రగతిపై మండలాలు, మున్సిపాలిటీలు వారిగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఆప్షన్ -3 కాంట్రాక్టర్లు 5,075 ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వీక్లీ టార్గెట్స్ నిర్ధారించుకొని పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.గృహ నిర్మాణాల ప్రగతిపై ప్రతివారం సమీక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలను మన జిల్లా రాష్ట్రస్థాయిలో 5 వ స్థానంలో ఉందని, మొదటి స్థానంలో ఉండే విధంగా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, జిల్లా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలరాజుతో ఎంఎంసీ చైర్మన్ రామారావు భేటీ



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్;** పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజును పోలవరం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ పొట్టా రామారావు గురువారం బర్రింకలపాడు లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ఏఎంసి చైర్మన్ గా నియమించడం పట్ల ఆయన ఎమ్మెల్యే బాలరాజు కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలరాజు ఏఎంసి చైర్మన్ పొట్టా రామారావుకు అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పొట్ట రామారావు అన్నారు. అనంతరం జీలుగుమిల్లిలో ఉన్న మార్కెటింగ్ చెక్ పోస్ట్‌ని ఆయన పరిశీలించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పాలడుగుల రామకృష్ణ , మోడియం ప్రసాద్, చెక్ పోస్ట్ సిబ్బంది శ్రీనివాసు, నాగు పాల్గొన్నారు.

## పెద్దపులి జాడపై స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలి

– వైసిపి నేత జెట్టి గురునాథరావు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురు నాథరావు మాట్లాడుతూ బుట్టాయిగూడెం మండలం,కొయ్యలగూడెం మండలం పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది. రైతుల వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. పెద్దపులి జాడను సరైన సమాచారం ఈ ప్రాంత ప్రజలకు తెలియజేయాలని విన్నవించారు.పెద్దపులి ఈ ప్రాంతంలోనే ఉన్నది లేనిది సరైన సమాచారం ప్రజలకు ప్రభుత్వ అధికారులు అవగాహన కల్పించాలి. వ్యవసాయ పనులకు ఆటంకం లేకుండా చూడాలి. పెద్దపులి వల్ల నష్టపోయిన పాడి రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి అని జెట్టి గురునాథరావు తెలియజేశారు.

## అతివేగం వద్దు - ప్రాణం ముద్దు

– విద్యార్థుల భద్రతపై పోలీసుల ప్రత్యేకంగా నిఘా



**కైకలూరు, మేజర్ న్యూస్,** పాఠశాల ,కళాశాల విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్,ఆదేశాల మేరకు కైకలూరు పట్టణంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై వెంకట కుమార్,సిబ్బంది ఈ తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు.పట్టణం లోని వివిధ విద్యా సంస్థలకు చెందిన బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన పోలీసులు, వాహనాల ఫిట్‌నెస్, బ్రేక్ కండిషన్, టైర్ల స్థితిగతులు,అత్యవసర ద్వారాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై వాహన చోదకులకు, యాజమాన్యాలకు పలు కీలక సూచనలు చేశారు. బాధ్యతాయుత ప్రయాణం వందలాది మంది విద్యార్థుల ప్రాణాలు మీ చేతుల్లో ఉన్నాయని ప్రతి డ్రైవర్ గుర్తించాలి. బస్సు కండిషన్ సరిగా లేకపోతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేయించాలి.” వేగం వద్దు – ప్రాణం ముద్దు అని,అతి వేగం ప్రమాదకరం అని,నిర్ణీత వేగ పరిమితి లోనే వాహనాలను నడపాలని హెచ్చరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, వాహన పత్రాలు ఆర్‌సి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని విద్యా సంస్థలు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్న కూరం ప్రసాద్



– ట్రోఫీలు అందించిన ఎస్సై క్రాంతి కుమార్

**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** యువతి యువకులు చెడు వ్యసనాలకు దూరం చేసి క్రీడల వైపు వెళ్లేలా చేయాలనే సంకల్పంతో చిన్న ఉద్యోగం చేస్తున్న వ్యక్తి గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువతీ యువకులకు చేయూతనిస్తున్నాడు. క్రీడలకు కావలసిన వస్తువులను అందిస్తూ యువతకు చేదోడువాదోడుగా ఉంటూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాడు. పలు గ్రామాలలో క్రీడా పోటీలు నిర్వహించడం క్రీడలకు కావలసిన ఆట వస్తువులు, ఆర్థిక సహాయం చేస్తూ యువతీ యువకులను క్రీడల వైపు వెళ్లేలా కృషి చేస్తున్న యువకుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్న ఉద్యోగి కూరం ప్రసాద్ ను పలువురు అభినందిస్తున్నారు. పోలవరం నిర్వాసిత గ్రామమైన చీడూరు గ్రామంలో చీడూరు యువకుల ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 13 క్రికెట్ టీమ్స్ పాల్గొన్నారు. వారం రోజులు పాటు సాగిన టోర్నమెంట్లో మొదటి బహుమతి చీడూరు గెలుపొందగా, రెండవ బహుమతి టేకూరు టీం గెలుపొందింది. మొదటి బహుమతికి 15వేలు, 2వ బహుమతికి 10వేలు నగదును బహుమతిగా అందించారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, ఎంపీటీసీ నాలి శ్రీనివాస్, కూరం ప్రసాద్ గెలుపొందిన జట్లకు బహుమతి లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై క్రాంతి కుమార్ మాట్లాడుతూ నేటి యువత సోషల్ మీడియా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులందరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందేల గోపాల రెడ్డి, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి బొరగం బొజ్జదొర, సుంకర అనిల్ కుమార్ రెడ్డి, క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఆధ్వర్యంలో సాగిపాడు స్మశాన వాటిక పరిశుభ్రం



**కామవరపుకోట,మేజర్ న్యూస్ :** మండలంలోని సాగిపాడు గ్రామ పంచాయతీలో గురువారం స్థానిక సర్పంచ్ గుండుగొలను. సుబ్బారావు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో శ్మశాన వాటికలోని ముళ్లపొదలను, చెత్త మొక్కలను తొలగించి నేలను చదును చేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు అవసరం అయిన శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి బాణవతు .బాలాజీ, టి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, ములకల పల్లి శ్రీనివాసరావు,మల్లంపల్లి. శ్రీనివాసరావు,టి.రామచంద్ర దుర్గారావు, టి.మాణిక్యాలరావు, టి.బుజ్జయ్య, పి.మాణిక్యాలరావు,టి.రాము తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10లక్షల విరాళం



**పాలకోడేరు, మేజర్ న్యూస్ :** పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి జడ్డు లీలా శ్రీధర్, జ్ఞానదీపిక దంపతులు గురువారం తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు 10లక్షల రూపాయలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆ దంపతులు తమ కుమారులు విరాట్,నందన్లతో కలిసి తిరుపతి వెళ్ళి శ్రీవారి దర్శనం అనంతరం అడిషనల్ ఏజ్ క్యూట్ ఆఫీసర్ కు భూరి విరాళాన్ని అందజేశారు. లీలా శ్రీధర్ ఉద్యోగరీత్యా హైదరాబాద్ లో ఉంటున్నారు. తన తల్లిదండ్రులు జడ్డు నాగేశ్వరరావు, శేషకుమారి ప్రోత్సాహం తో విరాళం శ్రీవారికి సమర్పించినట్లు శ్రీధర్ తెలిపారు.

## అంతర్వేది రథోత్సవంలో మాజీ మంత్రి కొత్తపల్లి



**అంతర్వేది / నర్సాపురం,మేజర్న్యూస్:** అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం గురువారం తెల్లవారుజామున నిర్వహించారు. అనంతరం రథోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలోమాజీ మంత్రి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, నర్సాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని తదితరులు పాల్గొని భక్తులతో పాటు రథాన్ని ముందుకులాగారు.

## ఆప్కాఫ్ చైర్మన్ ప్రమాణ స్వీకారంలో చైర్మన్ పెద్దిరాజు



**విజయవాడ / నరసాపురం, మేజర్ న్యూస్ :** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య ఆప్కాఫ్ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్, పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని మత్స్య సహకార సంఘాలు, కార్పొరేషన్ చైర్మన్ లు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని భవిష్యత్తులో మత్స్యకారుల అభివృద్ధి కోసం చేపట్టవలసిన కార్యక్రమాల గురించి వివరించారు.

## 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏ.పి.,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నగర మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం పాత కార్మిక చట్టాలను రద్దుచేసి నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లు తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయకూడదని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, పదవీ విరమణ చేసిన,విధి నిర్వహణలో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డిగర్ల నాగబాబు, బంగారు భవాని, రాగోలు దేవి,బొక్కె రాఘవులు, సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అప్పల నాయుడు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** వట్లూరు శ్రీ శిరిడి సాయిబాబా దర్శన ధ్యాన మందిరంలో వైభవంగా జరుగుతున్న 31వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆఖరిరోజు గురువారం బాబావారికి గణపతి పూజ,పుణ్యాహ వచనం, దీక్ష ధారణ గోపూజ,మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన, శ్రీ గణపతి దత్తాత్రేయ మృత్యుంజయ లలిత శ్రీరామచంద్ర సుబ్రహ్మణ్యేశ్వర సహిత శ్రీ శిరిడి సాయినాధుని మహా మూల యంత్ర హోమం,నవగ్రహ హోమాన్ని నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజకు ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్,నియోజకవర్గ జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు వీరంకి పండు,నాయకులు రెడ్డి గౌరీ శంకర్, సరిది రాజేష్,బెజవాడ నాగభూషణం,కొండల ప్రసాద్, బోండా రాము నాయుడు,ఆలయ కమిటీ సభ్యులు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ 31 వ వార్షికోత్సవ మహోత్సవాల విజయవంతానికి దగ్గరుండి పర్యవేక్షించారు.

# సత్ఫలితాలు ఇచ్చిన వ్యాపార అంచనాల ప్రదర్శన,ప్రణాళిక




**భీమడోలు,మేజర్ న్యూస్ :** స్వయం సహాయక సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపార అంచనాల ప్రదర్శన,ప్రణాళిక–ప్రయోజనాల అవగాహన కార్యక్రమం(బి.డి.పి) సత్ఫలితాలు ఇచ్చిందని, మండలం మహిళా సమాఖ్య , భీమడోలు ఎపిఎం.రత్నకుమారి తెలిపారు.ఇదే అంశంపై గత రెండు రోజులుగా మండల సమైక్య సిబ్బందికి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులకు, గ్రామ సమాఖ్య అధ్యక్షులకు మండల సమాఖ్య వేదికగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారంతో ముగిసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపిఎం. మాట్లాడుతూ, వ్యాపారవేత్తలుగా మారేందుకు ఆసక్తి కనపరిచిన సంఘాలకు పేదరిక నిర్మూలన సంస్థ స్త్రీ నిధి,ఉన్నతి, బ్యాంక్ లింకేజీ రుణాలు, సామాజిక పెట్టుబడులు, ఇతర పథకాల ద్వారా రుణాలను మంజూరు చేయనుందన్నారు.

– గుర్రపు డెక్కతో ఆహార పదార్థాల పంపిణీ –

కొల్లేరు సరస్సు ఆధారంగా అక్కడ లభ్యమయ్యే గుర్రపు డెక్క తో విస్తరాకుల తయారీ, ద్రవ పదార్థాల పంపిణీ వస్తువుల తయారీకి సభ్యులు ప్రతిపాదనలను సమర్పించారన్నారు. ఇప్పటికే వీటిపై పేదరిక నిర్మూలన సంస్థ చెట్టున్న పాడు గ్రామం కేంద్రంగా సదరు యూనిట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించేందుకు సర్వే కార్యక్రమాలు నిర్వహించిదన్నారు. ప్రతిపాదనలు అన్నింటిని ఉన్నతాధికారులకు సమర్పించి వారి ఆదేశాల మేరకు స్థానిక స్వయం సహాయక సంఘాల ఆసక్తి కి అనుగుణంగా యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యల కోసం ఉన్నతాధికారులు పరిశీలన చేస్తున్నట్టు,ఎపిఎం తెలిపారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లు,నిర్మల,రేఖ,వరలక్ష్మి, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# మొవ్వ పురుగుల నిర్మూలనకు విక్టర్ కంపెనీ మందులు ప్రయోజనకరం






**– జనరల్ మేనేజర్ చనుమోలు,పిఏసిఎస్ చెర్మన్ విత్తంశెట్టి సత్తిబాబు**

**అత్తిలి,మేజర్ న్యూస్ :** విక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో బల్లిపాడు గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.మొవ్వ పురుగు రైతులకు చాలా తలనొప్పిగా మారిందని,. ప్రముఖ విక్టర్ కంపెనీ వారు ఒక మందును పరిచయం చేసినట్లుయితే మొవ్వ పురుగులను పూర్తిగా నిర్మూలించవచ్చు అని కంపెనీ జనరల్ మేనేజర్ చనుమోలు నారాయణరావు అన్నారు. అదే విధంగా 35 రోజులు దాటిన పొలంలో బారియర్ మందును వాడటం వల్ల ఉల్లికొడు ఆకు చుట్టూ పురుగులను పూర్తిగ స్థాయిలో నిర్మూలించడమే కాకుండా దిగుబడి కూడా పెంచుతుందని తెలిపారు.మొవ్వ పురుగు,ఉల్లికొడుకీ,ఆకు పురుగులకు మంచి మందులు అని రీజనల్ మేనేజర్ సుధీర్,గొర్రెల సంజీవ్, పెద్ద రైతులు ,బల్లిపాడు పిఏసిఎస్ చెర్మన్ విత్తం శెట్టి వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) ,కాళ్ళగోవింద్,కొండలరావు, తాతరావు,ఆంజనేయులు పాల్గొన్నారు బరియర్ వాడిన రైతులు సంతోషం వ్యక్తం చేసి,మందును తెచ్చిన విక్టర్ కంపెనీ వారికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ రైతు అవగాహన సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పక్షవాత బాధిత కుటుంబానికి వైసిపి నేత కర్రా జయ సరిత వితరణ



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక 27వ వార్డ్ లో రావూరి శ్రీనివాస్ గత కొంత కాలంగా భార్య భర్తలు ఇద్దరికీ పక్షవాతం రావడం,శ్రీనివాస్ కి కాలు తొలగించడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉన్నందున ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు బియ్యం బస్తా రూ. 2వేల నగదును ఆర్థిక సహాయంగా న్యాయవాది,వైఎస్ఆర్సీపీ స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అందజేశారు. ఈ కార్య క్రమంలో వార్డ్ ఇంఛార్జి ఉప్పే పండు,వార్డ్ ప్రెసిడెంట్ పాల పర్తి కృపనాథ్, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు బద్ద అంతర్వేది, టౌన్ మహిళా ప్రెసిడెంట్ పెచ్చె ట్టి లక్ష్మీ విమల,వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకురాలు కుసుమ ఝాన్సి హేమలత, జ్యోతి, 27వ వార్డ్ కమిటీ సభ్యులు.తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారాయణతో ఎమ్మెల్యే బడేటి భేటీ



**అమరావతి / ఏలూరు,మేజర్ న్యూస్ :** అమరావతి,సి ఆర్ డి ఎ కార్యాలయం నందు మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణని మర్యాదపూర్వకంగా కలిసి ఏలూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు

**– అధికారులకు జేసి రాహుల్ కుమార్ ఆదేశం**



**ఇరగవరం,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.

గురువారం మండలంలోని కంతేరు పంచాయితీ కార్యలయంలో ఏర్పాటుచేసిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు.

అధికారుల పనితీరు, అమలవుతున్న పథకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

అనంతరం గ్రామంలో కొన్ని సంవత్సరాలనుండి అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కొవ్వూరి లక్ష్మిని ఆయన పరిశీలించి ఆమెకు అవసరమైన వైద్య సేవలు, పెన్షన్ తదితరులు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# చుక్క పాలు లేవు - వెన్న లేదు కానీ నెయ్యి తయారైందట



**– మాజీ సిఎం జగన్ పై టిడిపి నేతల ధ్వజం**

**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్;** తాడేపల్లిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికాసమావేశం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షత జరిగింది. రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో గత ప్రభుత్వ పనితీరుపై పలు విమర్శలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో పాలు లేవు,వెన్న లేదు కానీ నెయ్యి తయారయింది.

ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దేవాలయాల పైన దేవుళ్ళ పైన చేసిన పనులను తెలుగు తమ్ముళ్లు విమర్శించారు. అంతర్వేది ఘటన, విజయవాడ దేవాలయాల కూల్చివేత, తిరుమల హుండీ డబ్బు దుర్వినియోగం, సింహాచలం స్థలాలు కబ్జా, కల్తీ నెయ్యి వంటి విషయాలపై నాయకులు ప్రశ్నించారు. కల్తీ నెయ్యితో లడ్డు తయారీ పై సుప్రీంకోర్టు ఇచ్చిన నివేదిక మేరకు రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి విక్రయించారని వచ్చిన ఆరోపణ నిర్ధారణ మేరకు గతంలో జరిగిన తప్పుదాన్ని వైఎస్ఆర్సిపి నాయకులకు గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, పద్మనాభం మురళి, బాజీ రాంప్రసాద్ చౌదరి విజయలక్ష్మి, ముప్పిడి రమేష్,ముత్యాల శ్రీనివాస్, దొడ్ల బాలాజీ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు సందర్శించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు




**దెందులూరు,మేజర్ న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ఏలూరులోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం పరిశ్రమల సందర్శన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఎస్సీ రసాయన శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులను దెందులూరు గ్రామంలో ఉన్న సంజీవని న్యూట్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు తీసుకువెళ్లి, ఆహార నూనెల తయారీ విధానంపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు.ముఖ్యంగా రైస్ బ్రాన్ ఆయిల్ తయారీ ప్రక్రియ, శుద్ధి విధానం,తయారైన నూనె నాణ్యత పరీక్షలు ఎలా నిర్వహిస్తారో పరిశ్రమ నిపుణులు వివరంగా తెలియజేశారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి కె రమేశ్ విద్యార్థులకు పరిశ్రమలో జరుగుతున్న ప్రక్రియలను సమగ్రంగా వివరించారు.ఈ పరిశ్రమల సందర్శన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పూర్తి మద్దతు అందించి విద్యార్థులను ప్రోత్సహించారు.

## 1 నుండి వంతుల వారి విధానం అమలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** మొదటి వంతు కాకరపర్రు లాకుల నుంచి కవిటం వరకు.రెండవ వంతు కవిటం లాకుల నుంచి మొగల్తూరు శివారు వరకు పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ పరిధిలో నరసాపురం ప్రధాన కాలువకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఒంతులు వారి విధానం అమలు చేయనున్నట్లు పాలకొల్లు డిస్ట్రిబ్యూటర్ కమిటీ సమావేశం తీర్మానించింది. స్థానిక ఇరిగేషన్ ఏ ఈ కార్యాలయంలో డిస్టిబూటర్ కమిటీ అధ్యక్షుడు పెనుమత్స రాంభద్రారాజు అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఒకటో తేదీ నుంచి మొదలయ్యే మొదటి వంతు కాకరపర్రు లాకుల నుంచి కవిటం లాకుల వరకు, ఆరో తేదీ నుంచి రెండో వంతు కవిటం లాకుల నుంచి మొగల్తూరు శివారు వరకు సాగునీరు అందించేలా కమిటీ సమావేశం నిర్ణయించింది.మంత్రి రామానాయుడు ఆదేశాలతో ప్రతి రైతుకు,శివారు భూములకు సక్రమంగా సాగునీరు,త్రాగునీరు అందేలా సాగునీటి సంఘాల ప్రతినిధులు,ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేసేలా కమిటీ సమావేశం తీర్మానించింది. సమావేశంలో ఇరిగేషన్ డిఈ సిహెచ్ వెంకటనారాయణ,ఏ ఈ శ్రీనివాస్,సాగునీటి సంఘాల ప్రతినిధులు దేవరపు దొరబాబు,తానింకి వెంకట కృష్ణారావు,కోడేటి రామకృష్ణ,మాతా రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

## బిషప్ జయరావు ఆధ్వర్యంలో కతోలిక పీఠం సేవలు అభినందనీయం

**– ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



**ఏలూరు, మేజర్ న్యూస్:** రోమన్ కతోలిక పీఠాధిపతి మహా ఘనత వహించిన బిషప్ డా. జయరావ్ పొలిమేర ని జే వి య ర్ న గ ర్ నగర్‌లోని బిషప్ హౌస్‌లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ని ఏలూరు పీఠాధిపతి, పలువురు గురువులు సత్కరించారు.బిషప్ జయరావు పొలిమేర ఆధ్వర్యంలో ఏలూరు రోమన్ కతోలిక పీఠం ఆధ్వర్యంలో చేస్తున్న ప్రజా సేవలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఫాదర్ బేదంపూడి రాజు,వికార్ జనరల్ ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్, ఫాదర్ స్టీవెన్ సహ పలువురు గురువులు పాల్గొన్నారు.

# రజకుల సంక్షేమానికి ఇచ్చిన జీఓలు పటిష్ఠంగా అమలు చేయాలి



– మంత్రి అచ్చెన్నాయుడుకు నేతల వినతి

**విజయవాడ / ఏలూరు,మేజర్ న్యూస్ :** రజకులకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలుకు నోచుకోక క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదని,పటిష్ఠంగా జీవోలను అమలు చేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజకజన సంఘం అధ్యక్షులు,రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య కోరారు.గురువారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును,మాజీ ఎంఎల్‌సి దువ్వా రామారావును కలసి రజక జనసంఘ నాయకులు వినతి పత్రాలు సమర్పించారు.
ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును కలసిన నేపధ్యంలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించామని చెప్పారు.
ఇరువురు నాయకులు రజకుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించారని తెలిపారు.జిల్లా జాయింట్ సెక్రెటరీ కొమ్మంటి మురళీ మాట్లాడుతూ గ్రామాలలో రజక వృత్తిదారులు ప్రభుత్వ జీవోలు అమలు కాకా ఇబ్బందులు పడుతున్నరని, క్షేత్రస్థాయిలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.ఉమ్మడి జిల్లాలో కొన్ని గ్రామాలకు వస్తానని,తన వంతు సహకారం చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మంటి మురళీకృష్ణ, పి.శ్రీనివాసు,నాగ శేషుతో పాటు పలువురు రజకనేతలు పాల్గొన్నారు.

# తిరుమలలో చేసింది మహా పాపం






– అదే వైసీపీకి అయింది పెద్ద శాపం : ఎమ్మెల్యే చింతమనేని

తిరుమల తిరుపతి దేవస్థానంలో అత్యంత పవిత్రంగా భావించే స్వామివారి లడ్డు ప్రసాదంలో గత వైసీపీ ప్రభుత్వంలో కల్తీ నెయ్యి ఉపయోగించారనే అంశంపై ఏర్పాటుచేసిన సిట్ తమ చార్జి షీట్ నివేదికలో కల్తీ వాస్తవమే అంటూ ధృవీకరించిన నేపథ్యంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకం ఆధ్వర్యంలో గురువారం ఉదయం పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో కూటమి నాయకులతో కలిసి "మహా పాపం – కల్తీ నిజం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా స్థానిక ఐటిఐ కళాశాల నుంచి సాయిబాబా ఆలయం వరకు కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాదయాత్ర నిర్వహిస్తూ అత్యంత పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో గత వైసిపి పాలకులు చేసిన అక్రమాలపై నిరసిస్తూ నినాదాలు తెలిపారు.అనంతరం సాయిబాబా ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైనటువంటి తిరుమల పుణ్యక్షేత్రంలో కల్తీ నెయ్యి ద్వారా లడ్డూలు తయారు చేసి ఘోర అపచారానికి పాల్పడ్డారు కాబట్టే ఆ శాపం తగిలి వాళ్ళు ఈనాడు అధికారానికి దూరం అయ్యారని అన్నారు.. ఈనాటికి వైసిపి దిగజారుడు రాజకీయాలు మానుకోకుండా, బుకాయింపులతో వాస్తవాన్ని మరుగున పెట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.అదేవిధంగా పేర్ని నాని చెప్పే గాలి మాటలకు పసలేదని వాళ్ళు చేసిన తప్పులు ఏనాడు ఒప్పుకున్నారు కనుక వీటిని ఒప్పుకోవడానికి అని ప్రశ్నించారు..
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , యువ నాయకులు మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో కూటమీ ప్రభుత్వం, నిజాయితీగా నీతివంతమైన పాలనను ప్రజలకు అందిస్తుందని, గత పాలకులు రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేస్తే కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలు శ్రమిస్తుందని తెలిపారు.

# జిల్లాలో పట్టణ, గ్రామీణ వైద్య సేవలు భేష్





– రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానం
– అధికారులు ప్రతి అంశంలో జిల్లా ముందంజలో ఉండేలా కృషి చేయాలి

**భీమవరం,మేజర్ న్యూస్ :** రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయనంద్ రానున్న 2027 జనాభా లెక్కల సేకరణ,175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు, డిస్పెన్సరీలు, ఐఎంఎస్ ఆసుపత్రుల నిర్మాణానికి భూమి కేటాయింపు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతా బాయి, డి సి హెచ్ ఎస్ పి.సూర్య నారాయణ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, వివిధ శాఖలు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా ఆనంద్ మాట్లాడుతూ ముందుగా 2027 జనాభా లెక్కల సేకరణ సన్నాహక ఏర్పాట్లపై మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ సక్రమంగా సజావుగా నిర్వహించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆదిశగా కలక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వాటిని తుఛ తప్పక పాటించి రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలక్టర్లకు స్పష్టం చేశారు.అంతకు ముందు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు ప్రక్రియ ప్రగతిని సిఎస్ విజయానంద్ కలక్టర్లతో సమీక్షించారు. తదుపరి డిస్పెన్సరీలు, ఐఎంఎస్ ఆసుపత్రుల నిర్మాణానికి భూమి కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించారు. తొలుత 2025 డిసెంబర్ 25 నుండి జనవరి 26 వరకు జిల్లాలు వారీగా వివిధ అంశాలపై పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ సంతృప్తి స్థాయిలను ముఖ్య కార్యదర్శి వెల్లడించారు.

## మృతుడి కుటుంబానికి ఆటో డ్రైవర్ల సహాయం



**వేలేరుపాడు,మేజర్ న్యూస్ :** మండలంలోని జగన్నాథ పురం గ్రామానికి చెందిన నల్లగొప్పుల రామకృష్ణ (35) అనే వ్యక్తి బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసున్న ఆటో డ్రైవర్లు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయల నగదును గురువారం అందజేశారు.ఈ కార్యక్రమంలో కురిమల్ల శ్రీను, కమ్మచిచ్చు రమేష్,ఈగల పాటి శివాజీ,సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము,చిలకాని నాగేష్,పాషా,బహదూర్,చంటి తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయులు మాజీ ఎమ్మెల్యే గొట్టుముక్కల వెంకన్న



**నరసాపురం, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే దివంగత గొట్టుముక్కల వెంకన్న ఆదర్శనీయులని మల్లవరం లంక గ్రామ సర్పంచ్ జి సుజాత అన్నారు. గురువారం స్థానిక కస్తూరిబా గాంధీ హై స్కూల్ లో వెంకన్న 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ సుజాత మాట్లాడుతూ చదువు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆనాడే గుర్తించిన గొట్టుముక్కల వెంకన్న విద్యాలయాల స్థాపనకు నడుం బిగించారన్నారు. ఆయన స్థాపించిన విద్యాలయాల్లో ఎంతోమంది చదువుకుని ఉన్నత స్థితికి చేరారు అన్నారు. నేటి తరానికి వెంకన్న స్ఫూర్తిదాయకులని పాఠశాల ఉపాధ్యాయిని బి సోనీ, నీలకంఠం తదితరులు మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లంరాజు, పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గొట్టుముక్కల శేఖర్, ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జీబీ మెంబర్లు, కృపావరం, శ్రీనివాస్, సురేష్, నాగిని, లూసీ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దు

– ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పెంచడం అసాధ్యం : పీవో రాములు



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పెంచిస్తామని కొంతమంది మధ్యవర్తులు అమాయక ప్రజలను మోసం చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆర్ అండ్ అధికారి, ఐటిడిఏ పీఓ కె రాములు నాయక్ తెలిపారు. మండలంలోని కోట రామచంద్రపురం ఐటిడిఏ వద్ద గురువారం పిఓ రాములు నాయక్ విలేకరులతో మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం తుది నిర్ణయం చేయబడిందని ఆయన చెప్పారు. ఒక్కసారి తుది నిర్ణయం అయిన తరువాత దానిని మార్చడం ఎవరి వల్ల సాధ్యం కాదని ఆయన వివరించారు.కొంతమంది మధ్యవర్తులు అమాయక ప్రజలవద్దకు వెళ్లి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పెంచిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు. ఆర్ అండ్ ఆర్ పెంచడం అనేది అసాధ్యం అన్నారు. అటువంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఎవరైనా మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేయిస్తామని ఆయన ప్రజలకు తెలియజేశారు.